

కళాశాల బస్సు ఢీకొని ▸7
చిన్నారి దుర్మరణం
భీష్మ ఏకాదశికి.. ▸7
సత్యదేవుని సన్నిధిలో ఏర్పాట్లు



పుష్పక వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

వైభవంగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహుని దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజైన బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గరుడ పుష్పక వాహనంపై స్వామి వారు ఊరేగారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనానికి విచ్చేశారు. రాత్రి 7 గంటలకు పుష్పక వాహనంపై గ్రామోత్సవం జరిగింది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



సంప్రదాయ నృత్య ప్రదర్శన..

నన్నయలో ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవం

హాజరైన ఎమ్మెల్యే గోరంట్ల, వీసీ

400 మంది గిరిజన కళాకారులు, 1500 మంది ప్రతినిధులు హాజరు

అంగన్‌వాడీల పోరుబాట



అంగన్‌వాడీల నిరసన(పాతచిత్రం)

» సమస్యల పరిష్కారానికి ఉద్యమం

» 17 నుంచి ఆందోళనలకు శ్రీకారం

సామర్లకోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారం అందించి వారికి ఆటపాటలతోపాటు విద్యాబుద్ధులు నేర్పించే అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుగూ బొదుగూ లేని వేతనాలతో జీవనం సాగిస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదంటూ వారు వాపోతున్నారు.

జిల్లాలో 3,980మంది అంగన్‌వాడీలు

జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల ద్వారా 1,980 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రంలో వర్కర్, ఆయా చొప్పున 3,980మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం రూ.4,200గా ఉన్న వారి వేతనాన్ని రూ.10,500కు పెంచింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక వేతనాలు బాగా పెరుగుతాయని వారంతా ఆశించారు. కానీ రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకుంది. కనీస వేతనం అమలు చేయలేదని వారు తిరగబడ్డారు కానీ ఫలితం లేకపోయింది.

ఎస్మా ప్రయోగించినా..

తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలనే డిమాండ్‌తో 2021, డిసెంబరు 12 నుంచి 2024, జనవరి 23 వరకూ వైసీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీలు పోరాటం చేశారు. వారి విన్నపాలు అప్పటి వైసీపీ పెద్దలకు చెవికెక్కలేదు. పైగా ఎస్మా ప్రయోగించి విధులనుంచి తొలగిస్తామని హెచ్చరించింది. అయినా వారు ఏమాత్రం జంకలేదు. 42రోజులపాటు సుదీర్ఘంగా పోరాడినా డిమాండ్లను సాధించుకోలేకపోయారు. చట్టప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసినా దాని అమలుకు బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదని వారు ఆరోపించారు. ఈ క్రమంలో మళ్లీ తమ డిమాండ్ల సాధన కోసం పోరాటానికి సన్నద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 17, 18, 19 తేదీల్లో వారు తిరిగి ఆందోళన బాట పడుతున్నారు. కూటమి అధికారంలో ఉండడంతో తమ డిమాండ్లన్నీ పరిష్కారమవుతాయనే ఆశతో వారున్నారు.

ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలుగా పనిచేస్తున్నాం. మమ్మల్ని ప్రభుత్వో ద్యోగులుగా గుర్తించాలి. పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలి. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి.

-వడ్డి ఎస్తేరురాణి, ప్రధాన కార్యదర్శి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

కనీస వేతనం ఇవ్వాలి



ఏళ్ల తరబడి అంగన్‌వాడీలు చిన్నారుల సేవలో ఉన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చాలీచాలని వేతనాలతో జీవనం గడపలేకపోతున్నాం. కనీస వేతనం రూ.32వేలివ్వాలి.గ్రాట్యూటీ చెల్లించాలి.

-ఎలుబండి చంద్రావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్

లారీల కిరాయి పంచాయతీ

సుఖాంతం



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు, పాల్గొన్న ప్రతినిధులు

» కాకినాడ సీపోర్టు నుంచే వెళ్లే ప్రైవేట్ లారీలను అడ్డుకున్న లారీ యూనియన్

» కలెక్టరేట్ ఎదుట ధర్నా

» చివరికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి చొరవతో సమస్యకు పరిష్కారం

కాకినాడ సిటీ/కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): లారీల కిరాయి పంచాయతీ ఎట్టకేలకు సుఖాంతమైంది. బుధవారం కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో లారీ యూనియన్ నాయకులు, కంపెనీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఉభయులకు అంగీకార పరిష్కారం చూపారు. లారీలకు కిరాయి చెల్లించే విషయంలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్, కాకినాడ సీపోర్ట్ మధ్య వివాదం నెలకొంది. లారీల కిరాయి రేట్లు ఎక్కువగా ఉన్నాయని సీపోర్ట్, బోత్రా కంపెనీలు వ్యతిరేకించాయి. ఆ మేరకు వేరే ప్రాంతాలకు చెందిన లారీలు, టిప్పర్ల ద్వారా డీప్ వాటర్ పోర్టుకు ఎగుమతి చేయడంతో వివాదం మరింత ముదిరింది. కాకినాడ సీపోర్టునుంచి ప్రైవేటు లారీలు బొగ్గు రవాణాకు బయలుదేరగా మంగళవారం రాత్రి కాకినాడ లారీ యూనియన్ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో వారిని సర్పవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసోసియేషన్‌నాయకులపై బైండోవర్ కేసులు పెట్టి బుధవారం విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో కాకినాడ లారీ ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు.

ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చొరవ తీసుకుని కిరాయి రేట్ల విషయంలో లారీ అసోసియేషన్‌కు, సీపోర్టు కంపెనీలకు మధ్య సయోధ్య కుదిర్చారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో షిప్పింగ్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై లారీ కిరాయి రేట్లను కొలిక్కి తెచ్చి పరిష్కారం చూపారు. కేఎస్‌పీఎల్ ప్రతినిధులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల గెలుపే లక్ష్యం: ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుతల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షతన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. జగ్గంపేట నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, బీజేపీ ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, జీను మణిబాబు,బొల్లంరెడ్డి రామకృష్ణ, జాస్తివసంత్, అడబాల భాస్కరరావు, మారిశెట్టి భద్రం పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఎమ్మెల్యే నెహ్రూ, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి రమేష్, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్, జ్యోతుల నవీన్

మరో ఫిర్యాదు వస్తే..

లైసెన్స్ రద్దు

» కాకినాడలో ఓ హోటల్ నిర్వాహకులకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారుల హెచ్చరిక

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఒక ప్రముఖ హోటల్ నిర్వాహకులు ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడం లేదని, మరోసారి ఫిర్యాదు వస్తే లైసెన్సు రద్దు చేసి హోటల్స్ సీజ్ చేస్తామని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి.శ్రీనివాస్ అన్నారు.కాకినాడ రామారావుపేటలోని ఒకే కుటుంబానికి చెందిన మూడు ప్రముఖ హోటళ్లలో జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ బి.శ్రీనివాస్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఇతర అధికారులతో కలిసి బుధవారం తనిఖీలు నిర్వహించారు. నగరానికి చెందిన ఒక వినియోగదారుడు హోటల్లోని కంది పొడి, ఇతర తినుబండారాలపై ఎమ్మార్పీ రేట్లు, ఎక్స్‌పైరీ తేదీలు లేకపోవడంపై హోటల్ నిర్వాహకులను ప్రశ్నించగా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.దీంతో అతడు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశాడు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మాట్లాడుతూ శాంపిల్స్ ఆధారంగా మూడు హోటళ్లపై కేసులు నమోదు చేసి జేసీ కోర్టులో సమర్పిస్తామన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పెంపు

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల మద్యం దుకాణాల కేటాయింపు దరఖాస్తుల గడువు పెంచారు. ఈనెల 8 వరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. జిల్లాలో 16 మద్యం దుకాణాలను వీరికి కేటాయించారు. 9న దరఖాస్తుల పరిశీలన చేపడతారు. 10న ఉదయం 9గంటలకు దరఖాస్తులను డ్రా తీసి లబ్ధిదారులను కలెక్టర్ ప్రకటిస్తారు.

తక్షణమే ఇసుక సరఫరా చేయాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇసుకకోసం వచ్చిన లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేయాలని జేసీ రాహుల్ మీనా ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఇసుక స్టాక్ యార్డ్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పిఠాపురం మండలం చిత్రాడ, కరప మండలం ఉప్పలంక ఇసుక స్టాక్ యార్డులో ఇసుక సిద్ధంగా ఉందన్నారు. పెద్దాపురం ఇసుక స్టాక్ యార్డుకు కాటవరం రీచ్ నుంచి ఇసుక సరఫరా కావడంలేదని నిర్వాహకుడు జేసీ దృష్టికి తీసుకొచ్చారు.

మోడల్ అంగన్‌వాడీలు



(ఆంధ్రజ్యోతి, పిఠాపురం)

» అపోలో ఫౌండేషన్ తరపున ఉపాసన కొణిదెల చొరవ

» డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం నుంచి ప్రారంభించాలని నిర్ణయం

» అపోల్ గ్రూప్ చైర్మన్ ప్రతాప్.సి.రెడ్డి పుట్టినరోజున వెల్లడి

తల్లులు, నవజాత శిశువులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, పోషణ, ప్రాథమిక శిశు సంరక్షణ అందించడమే లక్ష్యంగా అపోలో గ్రూపు రాష్ట్రంలో మోడల్ అంగన్‌వాడీలు ప్రారంభించాలని నిర్ణయించింది. అపోలో గ్రూప్ చైర్మన్ డాక్టర్ ప్రతాప్.సి.రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఫౌండేషన్ తరపున ఉపాసన కొణిదెల సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంనుంచి దీనికిశ్రీకారం చుట్టబోతున్నారు.

ఆరగ్యోకరమైన సమాజం కోసమంటూ అపోలో ఫౌండేషన్, అపోలో మెడికల్ కాలేజీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటుతోపాటు మాతా, శిశు మరణాలను జీరోస్థాయికి తెచ్చేందుకుగాను వెయ్యిరోజుల కార్యక్రమం చేపట్టనున్నారు. పోషకాహారం, మాతా, శిశు సంరక్షణ ఇందులో కీలకపాత్ర పోషిస్తాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో ఫౌండేషన్ ప్రతినిధి ఉపాసన కొణిదెల క్రియాశీలకంగా వ్యవహరించనున్నారు. ప్రభుత్వం, ఐసీడీఎస్ అధికారులతో చర్చించిన అనంతరం దీనిపై ఆమె స్పష్టమైన ప్రకటన చేయనున్నట్లు సమాచారం.

పిఠాపురం నుంచే..

రాష్ట్రంలో 109 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించి మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు. తొలుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడినుంచి కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. ప్రస్తుతం పిఠాపురం నియోజకవర్గంలో 318 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల్లో ఒకదాన్ని పైలెట్‌ప్రాజెక్టుగా(మోడల్ అంగన్‌వాడీ కేంద్రం)గా ఎంపిక చేస్తారు. అనంతరం నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నారు.

మహిళా సాధికారికతకు..

తల్లులు, నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణతోపాటు మహిళా సాధికారికతకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణను అపోలో ఫౌండేషన్ ద్వారా అందిస్తారు. ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధించేలా తోడ్పాటు అందించనున్నారు.

అధికారులతో చర్చించి..

అపోలో ఫౌండేషన్ ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే కలెక్టర్ షాన్‌మోహన్ పిఠాపురం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై నివేదిక తీసుకున్నారు. నియోజకవర్గంలో 318 కేంద్రాలకుగాను 109 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలున్నాయి. మిగిలినవి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.త్వరలోనే అపోలో ఫౌండేషన్ ప్రతినిధులు ఇక్కడ అధికారులతో సమావేశం కానున్నారు.

నిర్వహించే కార్యక్రమాలు ఇవీ

గర్భిణులు, బాలింతలు, తల్లులు, నవజాత శిశువులు, చిన్నారుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం, పోషకాహారాన్ని అందించడం తదితర కార్యక్రమాలు చేపడతారు. ఇందుకోసం వైద్య, పోషకాహార నిపుణులను అపోలో ఫౌండేషన్, మెడికల్ కాలేజీ తరపున నియమిస్తారు. ఎప్పటికప్పుడు వీరి పర్యవేక్షణలో ఆరోగ్య పరిరక్షణ చర్యలు చేపడతారు. మాతా,శిశు మరణాలను శూన్య స్థాయికి తేవడంతోపాటు తల్లులు, నవజాత శిశువులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ, పోషణ, ప్రాథమిక శిశు సంరక్షణ అందించడమే లక్ష్యంగా ఆ మోడల్ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చర్యలు చేపడతారు. ఇక్కడి ఫలితాల ఆధారంగా కార్యక్రమాల నిర్వహణలో మార్పు, చేర్పులు చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయన్నపాత్రుడు

పోలవరం కాలువ ద్వారా తాండవకు లిఫ్ట్ ఇరిగేషన్

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి

కోటనందూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తుని మండలం రేఖవానిపాలెంవద్ద పోలవరం కాలువనుంచి తాండవ రిజర్వాయర్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్లు తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని స్పీకర్, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం తాండవరిజర్వాయర్‌వద్ద చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తాండవను రూ.2,700కోట్లతో అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, మాజీ జడ్పీటీసీ పెంటకోట సత్యనారాయణ, డి.చిరంజీవిరాజు, వెలగా వెంకటకృష్ణారావు, తాండవ రిజర్వాయర్ వైస్ చైర్మన్ మేరపురెడ్డి జోగిబాబు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షల్లో.. నూరుశాతం ఫలితాలు సాధించాలి

» వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

» ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఇంటర్మీడియట్ ప్రీ ఫైనల్ పరీక్షల ఉత్తీర్ణతశాతం వివరాలు, మార్చి1 నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. వీటిల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ మొదటి, రెండో ఏడాది విద్యార్థుల విద్యా బోధనలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగా రానున్న 25రోజులు జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. విద్యార్థులను వివిధ కేటగిరీలుగా విభజించి చదివించాలన్నారు. వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై మరింత దృష్టి సారించాలన్నారు. తరగతులకు సెల్ ఫోన్ తీసుకువచ్చే విద్యార్థులపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో డీఐఈవో జీజీకే నూకరాజు, ఆయా కళాశాలలో ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వేగం పెంచాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న 45రోజులపాటు అధిక సంఖ్యలో కూలీల హాజరుతో ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా డ్వామా, పంచాయతీరాజ్ అధికారులు, ఎండీవోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన రోడ్లు, గోకులం పశువుల షెడ్ల పనులన్నింటినీ మార్చి నెలకు పూర్తి చేయాలన్నారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు, విరాళాల సేకరణ పెద్దస్థాయిలో చేపట్టాలన్నారు. 26న మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా సదుపాయాలు, రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. డ్వామా పీడీ వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు పాల్గొన్నారు.

హత్యకేసును చేధించిన పోలీసులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును కాకినాడ పోర్టు పోలీసులు చేధించారు. కాకినాడ పర్లోవపేటకు చెందిన తిరిది అర్జునరావు(38) గతనెల 30న హత్యకు గురయ్యాడు. తొలుత అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు తర్వాత నిందితులు ఎల్లాజీ, కామరాజు, లోకేశ్వర్, విష్ణుతేజ, కన్నయ్య, వీరబాబు, సరోజినిలను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.





గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, తదితరులు , ఆలయంలో కొలువుదీరిన అష్టలక్ష్మీ విగ్రహాలు

వైభవంగా స్వామివారి గ్రామోత్సవాలు

- అంతర్వేదిలో కొనసాగుతున్న కల్యాణోత్సవాలు
- గరుడ, పుష్పక వాహనాల పై ఊరేగిన స్వామివారు
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్దసంఖ్యలో భక్తుల రాక



ఏర్పాట్లపై ఆలయ అధికారులను అడిగి తెలుసుకుంటున్న ఐజీ అశోక్‌కుమార్



అంతర్వేది, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చకస్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరి కాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి- అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించగా ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు పుష్పకవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కేరళ డప్పులతో వినూత్నరీతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమారరామ గోపాల రాజా బహద్దూర్, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ సేవా కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, నల్లా సత్య కిరణ్ ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగ మల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, వనమాలి మూలాస్వామి, కూటమి శ్రేణులు, అర్చకులు, వాహనకారులు, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు, పి.గన్నవరం, రాజోలు డెల్టా ఛైర్మన్లు గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, నాయకులు ముపర్తి నాని, గుబ్బల ఫణికుమార్, పోతురాజు కృష్ణ కొండ కిషోర్, వీర మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో భాగంగా నేడు..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటల నుంచి 7 గంటల వరకు స్వామివారి తిరువారాధన, ఆర్జిత అభిషేకం, బాలబోగం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుదర్శన హోమం, సాయంత్రం 4 గంటలకు హంస వాహన సేవ, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణ, రాత్రి 7 గంటలకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పటిష్ఠ భద్రతా చర్యలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులచే మహదాశీర్వచనం జరిపించారు. అనంతరం కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరు బయట కల్యాణం అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరుగుతున్నందున 1600 మంది పోలీసు యంత్రాంగం శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, స్వామివారి తెప్పోత్సవాల్లో ఎటువంటి తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు. కమాండ్ కంట్రోల్ రూము, వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు తీర్థ మహోత్సవాల పర్యవేక్షణ జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ బీ.కృష్ణారావుతో కలిసి కల్యాణ మండపం, భక్తుల దర్శన క్యూలైన్, రథం రోడ్డు, పార్కింగ్ తదితర తీర్థ మహోత్సవ ప్రదేశాలను పరిశీలించి పలు సూచనలు అందించారు. అనంతరం కల్యాణ మండపం వద్ద ఎంతమంది భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు టికెట్లు కేటాయించారని ఆలయ అధికారులను అడగ్గా సూపరింటెండెంట్ పి.విజయసారథి మాట్లాడుతూ 1500 టికెట్లను సాధారణ భక్తుల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. వన్‌వే రూటు, రవాణా సౌకర్యం, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్,సీఐలు నరేష్‌కుమార్, భీమరాజు, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, ఆలయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అడవితల్లి ముద్దుబిడ్డలు .. ఆదివాసీలు

- రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- 'నన్నయ'లో ఘనంగా ప్రారంభమైన జాతీయ గిరిజన మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి సంస్కృతీ వైభవాన్ని కాపాడుతున్న ఆదివాసీలు అడవి తల్లి ముద్దుబిడ్డలు అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ భవనంలో బుధవారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనికి ఎమ్మెల్యే గోరంట్ల, వర్సిటీ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు ఎన్టీఆర్ అందించిన సేవలను గుర్తుచేశారు. గిరిజన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందాలని సూచించారు. వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా నన్నయ వర్సిటీ ఆవిర్భవించిందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు అందరికీ తెలియాలనే ఉద్దేశంతో ఏడాదికొకసారి ఓ విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు.టీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిభాస్కర్, జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణునాయక్ మాట్లాడుతూ అడవిబిడ్డలుగా ఉన్న గిరిజనుల జీవనవిధానం ఒక ప్రత్యేక శైలిలో ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల నుంచి 1500 మంది ప్రతినిధులు, 400 మంది కళాకారులు హాజరైనట్టు అక్కులప్పనాయక్ తెలిపారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ గిరిజనుల చరిత్ర సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గిరిజన కళాకారులు థింసా, లంబాడీ, జానపద నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. తొలుత వర్సిటీ చాళుక్యద్వారం నుంచి ఆడిటోరియం వరకు సాంప్రదాయ నృత్యప్రదర్శనలతో ఆదివాసీ కళాకారులు భారీ ప్రదర్శన నిర్వహించారు.

కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు విష్ణు, దొర, రాజకుమార్ రెడ్డి, భగవాన్, వెస్లీ, రఘు, జానపద కళాకారుడు భిక్షునాయక్, టీఎస్ఎఫ్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మధులత, ఉపాధ్యక్షులు హేమలత, తెలంగాణ టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీ చాళుక్య ద్వారం నుంచి సంప్రదాయ నృత్యాల ప్రదర్శన

పాలిటెక్నిక్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో

'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య వైస్ ఛైర్మన్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జనవరి 28, 29 తేదీల్లో జరిగిన 27వ రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల్లో కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ విద్యార్థులు ఐదు పతకాలు సాధించారని ఆదిత్య విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. బాలుర విభాగంలో కె.సాంబశివరావు షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, జి.అవినాష్‌కుమార్ 200 మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, బాలికల విభాగంలో వీఎల్ఎస్ కృష్ణతులసి షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రోలో సిల్వర్ మెడల్, ఎస్‌కే సబీహ చదరంగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. మార్చిలో బెంగళూరులో జరిగే ఆలిండియా సౌత్‌జోన్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌కు అర్హత సాధించారు. విద్యార్థులను, వారికి తర్ఫీదునిచ్చిన పీడీలు సీహెచ్ మురళీమోహన్, కె.శేఖర్‌రెడ్డిను సతీష్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై పోలీసులకు శిక్షణ



డ్రోన్ల వినియోగంపై శిక్షణను పరిశీలిస్తున్న కాకినాడ ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డ్రోన్లను ఏవిధంగా వినియోగిస్తే సత్ఫలితాలను సాధించవచ్చో కాకినాడ జిల్లా వ్యాప్తంగా 97 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడ పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బుధవారం ఎస్పీ మాట్లాడుతూ త్వరలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా డ్రోన్లను ట్రాఫిక్ నియంత్రణలో, శాంతి భద్రతల పరిరక్షణలో, ఊరేగింపులు, బహిరంగ సభలు, జాతరలు, పండుగుల, ఉత్సవాల్లో ఉపయోగించడం.. మరీ ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్, బహిరంగ మద్యపానం, జూదాలు, నాటుసారాయి పట్టుకోవడంలో ఉపయోగిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో కొంతమందితో డ్రోన్ ఆపరేట్ చేయించి వారి శిక్షణ సామర్థ్యాన్ని పరిశీలించారు. శిక్షణ పొందిన వారిని ఆయా స్టేషన్లలో డ్రోన్‌లు ఉపయోగించి విధులు నిర్వర్తించడానికి ఉపయోగించనున్నారు.

బెండపూడిలో ప్రకృతి

సాగు విధానంపై అధ్యయనం

- జీవామృతాల తయారీని పరిశీలించిన శ్రీలంక రైతుల బృందం



బెండపూడిలో జీవామృతం తయారీని పరిశీలిస్తున్న శ్రీలంక బృందం

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అధ్యయనం చేసేందుకు వచ్చిన శ్రీలంక రైతుల బృందం బుధవారం తొండంగి మండలం బెండపూడి విచ్చేశారు. తేజ అరవింద్ అనే రైతు పొలాన్ని రత్నశ్రీ, ప్రియదర్శిని సికురా జపతి, హర్షలాసంత, తిలక్ చందన, అనోమ సంజీవని, హసాంక పరిశీలించారు. 30 ఎకరాల్లోని కొబ్బరి తోటలో అంతర పంటలుగా సాగవుతున్న కోకో, వక్క, అరటిలను చూసి అబ్బురపడ్డారు. తేమ కోసం, భూమి సత్తువ కోసం నవధాన్యాల పచ్చిరొట్టను పెంచుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. పూర్తి ప్రకృతి విధానంలో తోటలోనే అవసరమైన సేంద్రియ ఎరువుల తయారీని చూశారు. జీవామృతం, బీజామృతం తయారీ విధానాన్ని రైతును అడిగి తెలుసుకున్నారు. వీటి వినియోగంతో సాగు ఖర్చు ఏ మేరకు తగ్గుతుందో వివరంగా అడిగారు. తోటకు డ్రిప్ ద్వారా జీవామృతాన్ని అందించడం అద్భుతమని, ఇప్పటివరకు తాము పరిశీలించిన ప్రాంతాల్లో ఇది మెరుగైన విధానమన్నారు. రైతులు, స్థానికులతో మాట్లాడి సేంద్రియ సాగు ద్వారా చేకూరుతున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ గణేష్, ఎంటీ గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

దారి కాచి... అడ్డగించి

- సెల్ ఫోను, రూ. నాలుగు వేలు దోపిడీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపం జాతీయ రహదారిలో గల జీరో పాయింట్ వద్ద ఒక వ్యక్తిపై ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే... ఒడిశాకు చెందిన షకీలాద్దీన్ స్థానిక ఫ్రెండ్స్ దాబాలో సప్లయిర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తాను నివాసముంటున్న దివాన్‌చెరువులోని రూమ్‌కు వస్తుండగా, జీరో పాయింట్ వద్దకు వచ్చేసరికి ఐదుగురు వ్యక్తులు బైక్‌లపై వచ్చి వెంబడించి, అతని జేబులో ఉన్న రూ. నాలుగు వేల నగదు, మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకనైనా రాత్రిపూట గస్తీ ముమ్మరం చేయాలి.

వృద్ధుడి ఏటీఎం కొట్టేసి...

రూ.30 వేలు అపహరణ

- ప్రకాష్ నగర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సుమారు 60 ఏళ్ల పైబడిన వృద్ధుడ్ని గుర్తు తెలియని ఓ వ్యక్తి అతన్ని ఏ మార్చి ఏటీఎం కార్డును తస్కరించాడు.

దీంతో రూ. 30 వేలును డ్రా చేశాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాష్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం నారాయణపురం సమీపంలోని సుబ్బారావు నగర్‌కు చెందిన టీ.నాగభూషణం అనే వృద్ధుడు గతనెల 7న లాలాచెరువు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డబ్బులు తీసుకునే సమయంలో అక్కడే వున్న గుర్తుతెలియని వ్యక్తి మాటల్లో పెట్టి నాగభూషణం ఏటీఎం కార్డును మార్చేశాడు. దీన్ని గమనించని వృద్ధుడు తిరిగి ఇంటికి చేరుకున్నాడు. అయితే అతని బ్యాంక్ ఖాతాలోంచి గతనెలలోనే రెండు దఫాలుగా 30 వేలు నగదును సదరు గుర్తుతెలియని వ్యక్తి డ్రా చేశాడు. దీంతో బాధితుడు ప్రకాష్ నగర్ పోలీసులను బుధవారం ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 5 (ఆం ధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం వడ్డి వీరభద్రరావునగర్‌లో ఒక ఇంట్లో గుట్టుగా వ్యభిచారం జరుగుతున్నట్టు బొమ్మూరు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు సీఐ కాశీవిశ్వేశ్వరరావు తన బృందంతో వెళ్లి దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో సీఐ రైడ్ చేయగా, ఆ గృహంలో నిర్వాహకులు గుబ్బల వెంకటలక్ష్మి, ఆమె భర్త సత్యనారాయణ, ఇద్దరు విటులు, ఒక బాధిత మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది ఉన్నారు.

వచ్చే నెల 8న జాతీయ లోక్ అదాలత్

- పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సంబంధించిన కేసులను కూడా విచారిస్తారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఆ రోజున రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రాపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట,ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో ఉదయం 10 గంటల నుంచి కేసుల విచారణ ఉంటుందన్నారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, ప్రమాద, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్, ప్రీ-లిటిగేషన్ కేసులకు రాజీమార్గం ద్వారా పరిష్కారం లభించడం జరుగుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీడీజే సూచించారు.

అవినీతిని నిర్మూలిద్దాం : ఏసీబీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అవినీతి నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ ఎం.కిషోర్ కుమార్ పేర్కొన్నారు. అవినీతిపై సమాచారాన్ని రాజమహేంద్రవరం రేంజ్ అడిషనల్ ఎస్పీ 9440446102, డీఎస్పీ 94404 46160, తూర్పు గోదావరి ఇన్‌స్పెక్టర్ 9440446161, కాకినాడ జిల్లా ఇన్‌స్పెక్టర్ 8332971041, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌స్పెక్టర్ 9440446163, రాజమండ్రి ల్యాండ్‌లైన్ 0883-2467833 నంబర్లకు ఫోన్ చేయడం ద్వారా తెలియజేయడం బాధ్యతగా భావించాలన్నారు. అవసరమైతే వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వివాహిత అదృశ్యం

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంపత్‌నగరం గ్రామానికి చెందిన చెల్లూరి మణికంఠ అనే వ్యక్తి తన భార్య అదృశ్యమైనట్టు రాజానగరం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే ... మణికంఠ పాలడెయిరీలో పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే పాల డెయిరీకి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్య దుర్గ సూర్య, ఏడాది వయసు ఉన్న కుమార్తె నందిని ఇంట్లో కనిపించలేదు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన కోనే శ్రీనుపై అనుమానం ఉందంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమలాపురం నుంచి విశాఖపట్నం వరకు..!

- గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై చోరీల బాట పట్టిన యువకులు అరెస్టు
- మరో ముగ్గురు బాల నేరస్తులు కూడా అదుపులోకి
- రూ.8.82లక్షల విలువైన 13 మోటారు సైకిళ్లు స్వాధీనం


అమలాపురంలో దొంగల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైన ముగ్గురు యువకులు మరో ముగ్గురు బాలలతో కలిసి వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. అమలాపురం నుంచి ప్రారంభించి విశాఖపట్నం జిల్లా కంచరపాలెం పోలీసుస్టేషన్ పరిధి వరకు వీరు చోరీలకు పాల్పడ్డారు. అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో నమోదైన మోటారు సైకిల్ చోరీ కేసును చేధించేందుకు తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని నేరస్తులను పట్టుకునేందుకు నియమించారు. కోనసీమ జిల్లాలో వరుస దొంగతనాలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు యువకులను తాలూకా సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. 13 మోటారు సైకిళ్లను చోరీ చేసిన మేకల హరివీరవెంకటశ్రీరామమూర్తి, వీరమల్లు తరుణ్ శశికుమార్, దొంగ లోకేశ్‌లతో పాటు మరో ముగ్గురు బాల నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. 13 మోటారు సైకిళ్లతో పాటు 3 ఎక్సైడ్ బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. అమలాపురం తాలూకా పోలీసుస్టేషన్‌తో పాటు అల్లవరం, ముమ్మిడివరం, అమలాపురం టౌన్, కొత్తపేట, విశాఖ జిల్లా కంచరపాలెం, ఉప్పలగుప్తం, అంబాజీపేట పోలీసుస్టేషన్ల పరిధిలో వీరు వరుస దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. రూ.8.82లక్షల విలువైన మోటారు సైకిళ్లతో పాటు ఎక్సైడ్ బ్యాటరీలను రికవరీ చేసినట్టు వెల్లడించారు. కేసును చేధించిన సీఐ, ఎస్ఐలతో పాటు ఏఎస్ఐ వి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుల్ యు.రవికుమార్‌రాజు, కానిస్టేబుళ్లు బి.శివరామకృష్ణ, ఎం.ధర్మరాజులను డీఎస్పీ ప్రసాద్, జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. కేసును చేధించిన వీరికి రివార్డులు అందజేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన మోటారు సైకిళ్లను అమ్మడంతో పాటు తాకట్టు పెట్టడం, ఒక్కోసారి చెత్తను కొనుగోలు చేసేవారికి స్క్రాప్ కింద అమ్మివేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల ఆధారంగానే ఈ కేసును చేధించామన్నారు. యువకులపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే దొంగతనాలకు పాల్పడడంతో పాటు ఒక్కోసారి లా అండ్ ఆర్డరు సమస్యలు సృష్టించే అవకాశం ఉందన్నారు. భద్రత కోసం తప్పనిసరిగా ముఖ్యకూడళ్లలో, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను డీఎస్పీ వివరించారు. బాల నేరస్తులను వ్యక్తిగత పూచీకత్తులపై ఇంటికి పంపిస్తున్నట్టు వెల్లడించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

ఏలూరు రేంజ్ పరిధిలో
గంజాయి రవాణా తగ్గుముఖం

- పాత నేరస్థుల మీద నిఘా
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్


విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత 7 నెలలుగా ఏలూరు రేంజ్ పరిధిలో గంజాయి సాగు, అక్రమ రవాణా బాగా తగ్గుముఖం పట్టిందని, ముఖ్యంగా డాబీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అదుపులో ఉందని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం సాధారణ తనిఖీలలో భాగంగా రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాల రవాణాపై ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను పెట్టిందని, గంజాయికి సంబంధించి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరుకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. పాతనేరస్థుల మీద నిఘాపెట్టడం జరిగిందన్నారు. 15 వేల నుంచి 20 వేలమంది నేరస్థుల సమాచారం ఫోటోలు, వేలిముద్రలు, ఇతర వివరాలు డిజిటలైజ్ చేశామని.. భవిష్యత్తులో నేరాలు జరిగినప్పుడు వారిపై నిఘా పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. చిన్నపిల్లలు, మహిళల మీద నేరాలు చేసిన వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని ఇటువంటి నేరాలు జరుగకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ పెరిగిన మాట వాస్తవమన్నారు. చాలామంది అమాయకులు, గ్రామీణ ప్రాంతాలవారు, చదువుకున్నవారు కూడా మోసపోతున్నారన్నారు. సైబర్ నేరాల ద్వారా సొమ్ములు పోగొట్టుకున్నవారు 1930కు 3 గంటల్లోపుగా తొందరగా ఫోన్ చేస్తే డబ్బులు బదిలీ కాకుండా బ్యాంకువారితో మాట్లాడి నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. రిజర్వుబ్యాంకు అనుమతించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని, ఎక్కువ మొత్తాలకు ఆశ పడి ప్రయివేటు సంస్థలను ఆశ్రయిస్తే మోసం జరుగుతుందని ఆయన తెలిపారు.

అంతర్వేది, శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

అంతర్వేది నరసింహస్వామి కల్యాణోత్సవాలకు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని, 140 సీసీ కెమెరాలు, డ్రోన్లతో బందోబస్తు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రధాన కంట్రోల్‌రూమ్‌కు అనుబంధంగా రెండు సబ్‌కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని, ఒకటి సముద్రం ప్రాంతంలో మరొకటి ఆలయం వద్ద ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆలయ అధికారులు, జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మాహాశివరాత్రి ఉత్సవాలకు సంబంధించి సామర్లకోట, ద్రాక్షారామ తదితర ప్రాంతాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ బి. రఘువీర్, సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు ఉన్నారు.

8 నుంచి భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఆలయ సహాయ కమిషనర్


సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ సహాయ కమిషనర్ భవానీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 8 నుంచి 14 వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో, సహాయ కమిషనరు అల్లు వెంకటదుర్గాభవానీ తెలిపారు. బుధవారం ద్రాక్షారామ స్వామివారి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 8న 3.30 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, సాయంత్రం 6 గంటలకు నంది వాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుందన్నారు. రాత్రి 11.05 గంటలకు మణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, చండీకా సమేత సూరేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణ స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. 9 నగరుడ వాహనంపై నగరోత్సవం, 10న సాయంత్రం పండిత సదస్యం, రాత్రి 8 గంటలకు సర్వవాహనములపై నగరోత్సవం జరుగుతుందన్నారు. 11న మధ్యాహ్నం 2.55 గంటలకు రథోత్సవం జరుపుతామన్నారు. 12న వసంతోత్సవం, నాకబలి గ్రామోత్సవం, త్రిశూల శ్రీచక్రస్నానములు, రాత్రి 8 గంటలకు సర్వ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 13న సప్తగోదావరి నదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు. 14న శ్రీపుష్పోత్సవం జరుపుతామన్నారు. 8న ఉదయం స్వామివారికి దాతలు సత్తి సుబ్బారెడ్డి దంపతులతో లక్ష రుద్రాక్షల పూజ జరుపుతామన్నారు. భక్తులు కల్యాణోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కల్యాణ మహోత్సవాలు నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాటు చేసినట్టు ఆలయ ఈవో తెలిపారు.

భీష్మ ఏకాదశికి..
సత్యదేవుని సన్నిధిలో ఏర్పాట్లు

పరిశీలించిన ఈవో


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన భీష్మ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని సత్యదేవుని సన్నిధికి వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా అన్నవరం దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 15వేల వ్రతాలు వరకు జరుగుతాయని, 80వేల నుంచి లక్షమంది వరకు స్వామి సన్నిధికి విచ్చేస్తారనే అంచనాకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున తిరుమలలో తొక్కిసలాట సంఘటన నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడికక్కడ క్యూలైన్లు పటిష్టపరచడం, వ్రతాలు, దర్శన సమయాల్లో భక్తులు తోసుకోకుండా పశ్చిమరాజగోపురం వద్ద హోల్డింగ్‌పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్‌లలో తాగునీరు సదుపాయం, పలుచోట్ల చిన్నారులకు పాలు పంపిణీ, వృద్ధులు, దివ్యాంగుల కోసం లిఫ్ట్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు, ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. దీనికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం ఈవో వీర్ల సుబ్బారావు, దేవస్థానం సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. రాత్రి 10గంటల నుంచి వ్రతం టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించి 12 గంటల నుంచి వ్రతాలు, ఒంటిగంట నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని ఆదేశించారు. బుధవారం వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో ఈవో సమావేశమయ్యారు. వ్రతమాచరించుకునే భక్తుల పట్ల పురోహితులు మర్యాదపూర్వకంగా మెలగాలని, వారికి వచ్చిన సందేహాలను విసుగుచెందకుండా వివరంగా తెలపాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ సీహెచ్.రామ్మోహనరావు, ఏఈవోలు శ్రీనివాస్, జగ్గారావు, సూపరెంటెండెంట్‌లు బలువు సత్యశ్రీనివాస్, ఐవీ రామారావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

నీతి అయోగ్ సభ్యురాలు పూజలు

సత్యదేవుడి సన్నిధిలో బుధవారం నీతిఅయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సరస్వాట్ కుటుంబ సభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందచేయగా ఈవో వారికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.


అయోగ్ సభ్యురాలు సరస్వాట్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

కళాశాల బస్సు ఢీకొని మూడేళ్ల చిన్నారి మృతి


మృతి చెందిన సుకన్య (ఫైల్)

తొండంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పటివరకూ చెంగుచెంగున గెంతుతూ ఆటలాడుకున్న చిన్నారి కొద్ది నిమిషాల వ్యవధిలో విగత జీవిగా మారింది. బుధవారం కాకినాడ జిల్లా తొండంగి మండలం సీతారాంపురంలో శివకోటి సుకన్య (3) అనే చిన్నారిని తునికి చెందిన ఎస్వీ జూనియర్ కళాశాల బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఉదయమే విద్యార్థులతో కళాశాలకు వెళ్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా చిన్నారి మృతి చెందిందని గ్రామస్తులు, బంధువులు ఆరోపించారు. సింహాద్రి అప్పన్న, నాగలక్ష్మికి ఉన్న నలుగురు పిల్లల్లో సుకన్య మూడో సంతానం. అల్లారు ముద్దుగా పెరిగిన చిన్నారి కళ్లెదుటే శవమై కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు.

దళిత సంఘాల ఆందోళన

చిన్నారి మృతికి కారణమైన డ్రైవర్‌పై చర్య తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని దళిత నేతలు ఆందోళన చేపట్టారు. యాజమాన్యం వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచారి ఆందోళనకారులతో చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి న్యాయం చేసేందుకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సంఘటనపై కేసు నమోదు చేశారు.


ఆందోళన చేస్తున్నవారితో చర్చలు జరుపుతున్న ఎస్ఐ

తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు ప్రారంభం



తాటిపర్తిలో పోటీలను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాట్లాడుతున్న పడాల రవి

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో 18వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో గ్రామంలోని అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై ఈనెల 9వ తేదీ వరకూ నిర్వహించే ఈ పోటీలను జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించేందుకు నాటక కళాపరిషత్‌ల ద్వారా ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాటకాలకు నేటికి ఆదరణ తగ్గలేదని, ఇందుకు నిదర్శనం నాటికలను తిలకించేందుకు వస్తున్న ప్రజానీకమేనని తెలిపారు. మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు, న్యాయవాది పడాల రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, అపర్ణాదేవి ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, జనసేన నాయకులు బవిరిశెట్టి రాంబాబు, పిల్లా శివశంకర్, వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి ఉన్నారు.

పాదగయలో..

మహాశివరాత్రి ఉత్సవాలపై నేడు సమీక్ష

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు, మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై గురువారం మధ్యాహ్నం 3గంటలకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చేయాల్సిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఆర్డీవో సమీక్షిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

డెల్టా కాలువలకు నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రబీ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచి 8550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 2450 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1700 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4400 క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8562 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.65 అడుగులుగా నమోదయింది.

మూడో రోజుకు ఆలిండియా లాన్ టెన్నిస్ పోటీలు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐటా, గోదావరి ఏపీఎల్‌టీఏ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆలిండియా అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు బుధవారం మూడోరోజుకు చేరాయి. క్వార్టర్ సెమీఫైనల్‌లో వివిధ రాష్ట్రాల క్రీడాకారులు తలపడ్డారు. బాలుర విభాగంలో ధ్రువ్ (తమిళనాడు)పై ఎస్వీసూర్య(ఏపీ) 6-06-1, తనీష్(తెలంగాణ)పై దుర్గాశ్రీ (ఏపీ) 3-6,6-3,6-4, విస్సెంట్(ఏపీ)పై విశ్రాంక్(తెలంగాణ) 6-26-4, భువన్(ఏపీ)పై భవేష్(తెలంగాణ)7-6,6-1 స్కోరుతో గెలుపొందారు.

బాలికల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో జోషిత(ఏపీ)పై సుమేరా(ఏపీ)7-6(4)6-1, గౌరిశ్రీ (తెలంగాణ)పై జానకి(ఏపీ), 6-3,6-1, సవర్ణిక(తెలంగాణ)పై లేఖ్య(ఏపీ)7-5,7-5, జోహా(తెంగాణ)పై సంజన(ఏపీ)6-2,6-3 స్కోరుతో గెలుపొందారు. లాన్‌టెన్నిస్ సంఘ రాష్ట్ర కార్యదర్శి పీవీ రామ్‌కుమార్ పర్యవేక్షించారు.

మానవ జీవనంలో కళ అత్యుత్తమం

సినీ గేయ రచయిత జొన్నవిత్తుల

'శ్రీప్రకాష్'లో హరివిల్లు కార్యక్రమం


జొన్నవిత్తులను సత్కరిస్తున్న విజయ్‌ప్రకాష్

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మానవ జీవనంలో కళ అత్యుత్తమమైనది, అది అత్యుత్తమమైన మనస్సుకు ప్రశాంతతనిస్తుందని కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. కాకినాడ సురేష్ నగర్ శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లోని సీతానరసింహ క్షేత్రం నందు శ్రీప్రకాష్ విద్యాసంస్థలు కాకినాడ, పెద్దాపురం శాఖలు సంయుక్తంగా బుధవారం హరివిల్లు కార్యక్రమం నిర్వహించాయి. ఐదురోజుల పాటు జరిగే హరివిల్లు ఆర్ట్ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌లో విద్యార్థులు చిత్తు కాగితాలతో రూపొందించిన చిత్రరువులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా హాజరైన జొన్న విత్తుల, చిత్రకారిణి గౌరీవేముల, గ్రంధి రాజగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జొన్న విత్తుల మాట్లాడుతూ హరివిల్లు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నిద్రాణమై ఉన్న శక్తిని వెలికితీసి సమాజానికి ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చే విధంగా చిత్రాలు, కళాకృతులు ఉన్నాయన్నారు. గౌరీ మాట్లాడుతూ కళ అనేది ఒక తపస్సు అని కళాకారుడు ఒక రుషీశ్వరుడని అన్నారు. అతిథులను శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ సత్కరించారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ కాకినాడ ఫౌండర్ కిషోర్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రీప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిని పొడిచిన కేసులో నిందితుడికి ఏడాది జైలు

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామంలో 2020లో దొంగ ఓ ఇంటిలో దొంగతనం చేసి పారిపోతుండగా అదేసమయంలో అతడిని అడ్డుకున్న వ్యక్తిని పొడవడంతో దొంగకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ 3వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి చావలి రమ్య తీర్పు నిచ్చారు. సీఐ ఏ.వేంకటేశ్వరరావు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 2020లో కడియపులంకలో ఓ వ్యక్తి ఓ ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డాడు. అనంతరం పారిపోతున్న సమయంలో ఓ వ్యక్తి అడ్డుకోవడంతో దొంగ పొడిచాడు. ఈ విషయంపై అప్పటి ఎస్ఐ ఎస్ కే.అమీనాబేగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అప్పటి క్రైం కానిస్టేబుల్ కే.సురేష్ నిందితుడిని అరెస్టు చేశారు. 3వ ఏజెఎఫ్‌సీఎం ప్రిన్సిపల్ జువైనల్ జస్టిస్ బోర్డ్ కోర్ట్ నందు ప్రస్తుత సీఐ ఏ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎం రాజేంద్ర సకాలంలో సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ సీహెచ్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. దీంతో దొంగతనానికి పాల్పడి పారిపోతున్న సమయంలో అడ్డుకున్న వ్యక్తిని పొడిచిన నిందితుడు నేతల రాజేష్‌వర్మ అలియాస్ రాజేష్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు రెండున్నరేళ్ల జైలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిలిస్టు మృతికి కారణమయిన లారీ డ్రైవర్‌కు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.బాబు బుధవారం తీర్పు చెప్పారు. పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సిగటాపు శ్రీనివాసరావు విధి నిర్వహణ అనంతరం కాకినాడకు మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా చిత్రాడ మహాలక్ష్మీ ఆలయం వద్ద ఎదురుగా రాంగ్‌రూట్‌లో వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. 2021లో జరిగిన ఈ సంఘటనపై అప్పటి పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం లారీ డ్రైవర్ పోతల అప్పలనాయుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో అప్పలనాయుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీలు ఎం.ప్రకాశరావు, జి.వినయప్రతాప్‌లు వాదనలు వినిపించారు.

బాలికను మోసం చేసిన బాలుడిపై పోక్సో కేసు

రాజానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని నమ్మ బలుకుతూ... తీరా పెళ్లి చేసుకుందామని ఆ బాలిక అడగడంతో ముఖం చాటేశాడు ఓ బాలుడు... వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం - నరేంద్రపురం జంక్షన్ ప్రాంతంలో నివసిస్తున్న ఒక బాలికను అదే ప్రాంతంలో ఉంటున్న బాలుడు హైస్కూల్ స్థాయి నుంచి నిన్ను ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతుండేవాడు. కొంతకాలం తిరస్కరిస్తూ వచ్చిన సదరు బాలికను ఎట్టకేలకు లొంగదీసుకున్నాడు. ఈ మేరకు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ నారాయణమ్మ దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

కంప్యూటర్, లాప్‌టాప్‌లు, ప్రింటర్ స్వాధీనం



నిందితుడితో పోలీసులు స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్‌లు, ప్రింటరు, కంప్యూటర్

కడియం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన ముగ్గురిలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి కంప్యూటర్, లాప్‌టాప్, ప్రింటర్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు కడియం పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం....గత నెల 9వ తేదీన స్థానిక జాతీయ రహదారి పక్కన వెంకయ్యపేట పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ నందు షటర్ తాళాలు బద్దలు గొట్టి లాప్‌టాప్, కంప్యూటర్, కొంత నగదు దొంగిలించినట్టు వచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. తూరుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో కడియం సీఐ ఏ.వేంకటేశ్వరరావు, ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ ఈ కేసు చేదించారు. ఈ చోరీలకు ముగ్గురు పాల్పడినట్టు పోలీసులు నిర్ధారించారు. ముగ్గురిలో ఒకరైన దొంగతనానికి పాల్పడిన కృష్ణా జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన అల్లడి నాగ మణికంఠ ఈశ్వర్‌ను అరెస్టు చేసి అతడి నుంచి లాప్‌టాప్, కంప్యూటర్, తణుకు పరిధిలో దొంగతనం చేసిన ఓ మోటారు సైకిల్, కొత్తగూడెం పరిధిలో దొంగతనం చేసిన లాప్‌టాప్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్టు... మరోవ్యక్తిని టంగుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో అరెస్టు చేశారని,మరోవ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని 11వ సర్కిల్‌లో 37వ డివిజన్ అంబేడ్కర్ భవనం ప్రాంతంలో పారిశుధ్య పనుల నిర్వహణను బుధవారం తెల్లవారుజామున నగరపాలక సంస్థ కమిషనర్ భావన తనిఖీ చేశారు. ఏడో సర్కిల్ అన్నమఘాటీ సెంటర్, 26వ డివిజన్‌లో పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

సామర్లకోటలో జిల్లా ఎస్పీ తనిఖీలు



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

సామర్లకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ బిందుమాధవ్ బుధవారం సాయంత్రం సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వివిధ నేరాలకు చెందిన కేసులు, చోరీ సంఘటనలు, రికవరీలు, పోలీసుల పనితీరుకు చెంది రికార్డులను పరిశీలించారు. సీఐ కృష్ణభగవాన్‌తో సిబ్బంది పనితీరుపై సమీక్షించారు. పోలీసు అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం విలేకర్లతో ఎస్పీ మాట్లాడుతూ సామర్లకోటలో ట్రాఫిక్ సమస్యకు త్వరలోనే ఈ మేరకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలకు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకునేలా పోలీసు అధికారులను ఆదేశించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ కృష్ణభగవాన్, ఎస్‌బీ హెచ్‌సీ జీ.కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్ భావన

సామర్లకోట పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా రోజూ సరఫరా చేస్తున్న తాగునీటి సరఫరా విధానాన్ని ట్రైనీ కలెక్టర్, కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న భావన బుధవారం సాయంత్రం పరిశీలించారు. పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గోదావరి జలాలు వేసవి జలాశయంలో ఎంత మేర నిల్వలు చేశారు, జలాశయానికి గోదావరి జలాలు చేరే మార్గాలను పరిశీలించారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తదితర అంశాలపై కమిషనర్ శ్రీవిద్యతో భావన సమీక్షించి తగు ఆదేశాలు ఇచ్చారు.

పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం కాకినాడ జిల్లా కార్యవర్గం ఎన్నిక బుధవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్‌వీ ప్రసాద్‌రావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో జిల్లాలో ఉన్న అందరూ డీఎల్డీవోలు, ఎంపీడీవోలు పాల్గొని, కాకినాడ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అడపా వెంకట లక్ష్మి(డ్వామా పీడీ), ఎగ్జిక్యూటివ్ అధ్యక్షులుగా రామ్‌గోపాల్, డిప్యూటీ సీఈవో, జిల్లా అధ్యక్షులుగా డి.శ్రీలలిత(ఎంపీడీవో, పెద్దాపురం) ఉపాధ్యక్షులుగా సాయినవీన్(ఎంపీడీవో, తుని), ఉపాధ్యక్షులుగా జగదాంబ(ఏపీడీ, డ్వామా), జనరల్ సెక్రటరీగా రాంబాబు(ఎంపీడీవో, కాజులూరు), జాయింట్ సెక్రటరీగా హరికృష్ణ(ఎంపీడీవో, కిర్లంపూడి), సెక్రటరీలుగా కుమార్ బాబు(ఎంపీడీవో, ప్రత్తిపాడు), హిమమహేశ్వరి(ఎంపీడీవో, సామర్లకోట), మహిళా కార్యదర్శిగా స్వప్న(ఎంపీడీవో, కరప), కోశాధికారిగా భాస్కర్(డీఎల్డీవో, డ్వామా) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఆ సంఘ రాష్ట్ర నాయకులు, అధికారులు, సభ్యులు అభినందించారు. కార్యవర్గం జిల్లా అధ్యక్షులు శ్రీలలిత, జనరల్ సెక్రటరీ రాంబాబు మాట్లాడుతూ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గెజిటెడ్ అధికారుల సంఘం కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యులు

ఆంధ్రజ్యోతి వార్తలకు స్పందన

విద్యుత్‌స్తంభంపై పిచ్చి మొక్కలు తొలగింపు



విద్యుత్‌స్తంభంపై పిచ్చిమొక్కలు తొలగించిన దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభంపై పిచ్చి మొక్కలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. కిందకు వేలాడుతున్న కరెంటు తీగలను సరిచేసేందుకు చర్యలు చేపట్టారు. పిఠాపురంలోని 18వ వార్డు దాసరి వారి వీధిలో విద్యుత్ స్తంభంపై పిచ్చి మొక్కలు పెరిగిపోయి గాలులు, వర్షాల సమయంలో తరచూ కరెంటు సరఫరా నిలిచిపోవడం, మంటలు చెలరేగడం జరుగుతోందని, అదే ప్రాంతంలో కరెంటు తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ స్పందించారు. తక్షణం పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. ఈఈ ఆదేశాలతో విద్యుత్ సిబ్బంది స్తంభంపైకి ఉన్న పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించారు. అక్కడ ఉన్న కరెంటు తీగలను సరిచేశారు. అదే విధంగా కిందకు వేలాడుతూ ఉన్న సర్వీసు, కరెంటు వైర్లు మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

పేరు మార్పునకు దరఖాస్తు స్వీకరణ

సచివాలయాల సిబ్బంది తీరుపై కలెక్టర్, ఆర్డీవో ఆగ్రహం

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అడంగల్‌లో పేరు మార్పు కోసం ఐటీ ఉద్యోగి పడుతున్న తిప్పలకు పరిష్కారం లభించింది. పిఠాపురంలోని పల్లపు వీధికి చెందిన ఐటీ ఉద్యోగి రెడ్డిపల్లి రాజేష్‌కు చెందిన భూమి అడంగల్ ఆన్‌లైన్‌లో తండ్రి పేరుకు బదులుగా తాత పద్మరాజు పేరు నమోదు కావడం, దీనికి గానూ హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్న అతడు సెలవు పెట్టుకుని పిఠాపురం వచ్చి 2 రోజులుగా కోటగుమ్మం, మోహన్‌నగర్ వార్డు సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేసినా తిప్పిస్తూ కనీసం దరఖాస్తు తీసుకోవడంలేదంటూ అతడు వ్యక్తం చేస్తున్న ఆవేదనను తెలియజేస్తూ పేరు మార్పు కోసం తిప్పలు శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబులు స్పందించి సచివాలయ సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం దరఖాస్తు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో తహశీల్దారు వీవీ గోపాలకృష్ణ రాజేష్‌తో మాట్లాడి ఇందిరానగర్ సచివాలయంలో దరఖాస్తు చేయాలని సూచించారు. అనంతరం పేరు మార్పు కోసం రాజేష్ చేసిన దరఖాస్తును సచివాలయ సిబ్బంది స్వీకరించారు. నిర్ణీత గడువు ముగియగానే ఆన్‌లైన్‌లో పేరు మార్పు చేస్తామని తహశీల్దారు తెలిపారు. సచివాలయ సిబ్బందితో కమిషనరు సమావేశం నిర్వహించారు. ప్రజలు ఏ అంశంపై దరఖాస్తు చేసుకునేందుకు వచ్చినా స్వీకరించాలని, దరఖాస్తులు తీసుకునేందుకు తిరస్కరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు

పిఠాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు, దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా ఉన్న కుంతీమాధవస్వామి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేయాలని విశ్వహిందూపరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు వీహెచ్‌పీ ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహాశివరాత్రి ఉత్సవాలు, కుక్కుటేశుని కల్యాణోత్సవాలు, రథోత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, వారికి తగు భద్రత కల్పించాలని వారు కోరారు. గర్భిణులు, వృద్ధులకు ప్రత్యేక ప్రవేశం కల్పించాలన్నారు. మహిళా భక్తుల రక్షణపై దృష్టి పెట్టాలని, ఉత్సవాలసమయంలో పిఠాపురంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ని కలిసినవారిలో వీహెచ్‌పీ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, దువ్వా మణికుమార్, సురేంద్ర దత్త, కొండేపూడి శివ తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కాకినాడలో దోమలు విపరీతంగా పెరిగి అపారిశుధ్యం తాండవిస్తోందని నివారణకు చర్యలు తీసుకోవాలని దిశ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తోపాటు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావనకు బుధవారం వినతిపత్రం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో దోమల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరుగుదొడ్ల గొట్టాలకు వలలు కట్టడంతోపాటు మురికి గుంటల, కాలువల్లో ఫినాయిల్, బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమల నివారణ చర్యలు, అపారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో స్వచ్ఛంద సంస్థలతో పాటు ప్రజాసంఘాల నాయకులను భాగస్వాములు చేసి సుందర కాకినాడగా రూపుదిద్దేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కమిటీ సభ్యులు నందమూరి వినోద్, స్వాతిలక్ష్మి పాల్గొన్నారు.



భావనారుషి కల్యాణం


గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో కొలువయి ఉన్న భద్రవాతి సమేత భావనారుషి స్వామి వార్ల కల్యాణం కనుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదిక స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి వేదపండితుల మంత్రోశ్చారణల మధ్య కల్యాణ క్రతువు నిర్వహించారు. భక్తులు అధికంగా హాజరు కాగా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటి నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు

8న కల్యాణం, 11న రథోత్సవం

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురంలోని అతి ప్రాచీనమయిన కుంతీమాధవస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. కుంతీమాధవుని దివ్యకల్యాణమహోత్సవాలు గురువారం ప్రారంభమై 13వ తేదీ వరకూ జరగనున్నాయి. 6న ధ్వజారోహణం, విష్వక్సేనులవారి గ్రామోత్సవం, 7న చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి ఉత్సవులకు అలంకార తిరుమంజనం, కల్యాణాలంకారం, 8న పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి 9గంటలకు స్వామి కల్యాణం, 9న ఉదయం గరుడ వాహనంపై సాయంత్రం శేష వాహనంపై గ్రామోత్సవం, 10న రాత్రి పొన్నవాహనంపై గ్రామోత్సవం, 11న రాత్రి రథోత్సవం, 12న ఉప్పాడ సముద్రం వద్ద స్వామికి చక్రస్నానం, అన్న సమారాధన, రాత్రి ఆలయంలో చోరసంవాదం, 13న పంచామృతాభిషేకం, కుంకుమపూజలు, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయి. రోజూ వేదపారాయణ జరుగుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో నున్న శ్రీరాములు, భక్త బృందం సభ్యులు కోరారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ మూర్తి మృతి



డాక్టర్ మూర్తి(ఫైల్)

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పరిసర గ్రామాల్లో అందరి వైద్యుడిగా పేరుగాంచిన మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్‌ఎస్‌ఆర్ మూర్తి(87) బుధవారం మరణించారు. పట్టణంలోని సౌగంధి అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న ఆయన గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈయన 2000-2005 మధ్య పిఠాపురం పురపాలక సంఘ చైర్మన్‌గా పనిచేశారు. వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయనకు ఏడుగురు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అన్నిరకాల వైద్యసేవలను అందించే పేదల వైద్యుడిగా ఆయనకు పేరుంది. డాక్టర్ మూర్తి మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా ఉప్పాలమ్మతల్లి వార్షికోత్సవం

కరప, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కరప గ్రామ దేవత ఉప్పాలమ్మతల్లి ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి నూతన ఆలయం నిర్మించి, విగ్రహ పునఃప్రతిష్ఠ గావించి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక దుర్గాదేవి ఆలయం నుంచి యువతులు, మహిళలు 108 కళశాలతో ఊరేగింపుగా వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. విశేషాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని ఊరి ఆడపడుచులు, గ్రామస్తులు భక్తితో పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వేములవాడ గ్రామస్తులు ఆ ఊరి గ్రామ దేవత ముసాలమ్మతల్లి ఆలయం నుంచి భారీ సారెను ఉప్పాలమ్మకు సమర్పించి పూజాధికాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసంతర్పణ నిర్వహించగా సుమారు 10వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, జనసేన నేత పంతం సందీప్, టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు బండారు మురళి, బొగిరెడ్డి గంగాధర్, గ్రామపెద్దలు నక్కా భద్రం, పాట్నీడి భీమన్న, గొర్రెల వెంకన్న, చిన్నారి మురళీకృష్ణ, చోడపునీడి వెంకటరమణ, రెడ్డి వెంకన్న తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.



ఉప్పాలమ్మను దర్శించుకుంటున్న జనసేన నేత సందీప్

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగింపు

పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మహారాజా వారధికి ఇరువైపులా ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయని, వీటిని తొలగించి రాకపోకలు సాగించేందుకు వీలుగా కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలని కొంతకాలంగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, అధికారులు స్పందించి పరిశీలన జరిపి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీంతో బుధవారం రైతులు ముందుకు వచ్చి జేసీబీతో సదరు ఆక్రమణల తొలగింపును ప్రారంభించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా వర్మ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అధికారప్రతినిధి వర్మ, పీలా గోవిందనారాయణ

కొత్తపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉభయగోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించి కూటమి సత్తా చాటుదామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కార్యకర్తలకు పిలుపిచ్చారు. కొత్తపల్లి, రవీంద్రపురం, ఉప్పాడ, అమీనబాద్ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు విజయం కోరుతూ ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పిఠాపురంలో నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం చేకూర్చాలని ఓటర్లను అభ్యర్థించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులు, అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, వీబీసీ డీసీ-2 చైర్మన్ అనిశెట్టి సత్యానందరెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖర్ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం అంతా సమష్టిగా కృషి చేయాలని, ప్రతీ 30మంది ఓటర్లకు ఒకరు బాధ్యత తీసుకుని పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్యశ్రీ కార్పొరేషన్ చైర్మన్, ఎన్నికల అబ్జర్వర్ ఎస్.సుధాకర్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. బుధవారం రమణయ్యపేట శ్రీకన్వెన్షన్ హాల్లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమాయత్త సమావేశంలో టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), రాష్ట్ర గౌడ్, ఎస్సీ మాల కార్పొరేషన్ల డైరెక్టర్లు మట్టా ప్రకాశ్‌గౌడ్, కొల్లాబత్తుల అప్పారావు, కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పితాని లీలావతి, పంతం సందీప్‌లు మాట్లాడారు. కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం త్వరలోనే నెరవేరుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఓటర్లకు వివరించాలన్నారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకులు బొల్లా వెంకటరమణ, రాజా సూరిబాబు రాజు, నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి వి.వెంకటరమణ, తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాసు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదిరులు పాల్గొన్నారు. నాయకులు శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, పితాని లీలావతి, కాళ్ల ధనరాజు, కాళ్ల సత్తిబాబు, పలివెల త్రిమూర్తులు, బోళ్ల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



కూటమి నాయకులతో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, అబ్జర్వర్ సుధాకర్ సంఘీభావం

పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా చెందుర్తిలో బుధవారం సాయంత్రం టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఓటర్ల వద్దకు వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో గొల్లప్రోలు మాజీ జడ్పీటీసీ సభ్యుడు మడికి ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి సమావేశం

సామర్లకోట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు విశేష కృషిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎన్నికల పరిశీలకులు గండి బాబ్జీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతులు నవీన్, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) పిలుపునిచ్చారు. బుధవారం సామర్లకోట రైతు భవన్‌ఆవరణలో గ్రాడ్యుయేట్ ఎన్నికల సమన్వయ ఎన్డీఏ కూటమి సమావేశం ఎమ్మెల్యే చినరాజప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల్లో

బీజేపీ శ్రేణులు కృషిచేయాలి

సామర్లకోట, ఫిబ్రవరి 5:(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి బీజేపీ శ్రేణులందరూ కృషిచేయాలని సామర్లకోట సంపెంగతోట చక్రవర్తి అపార్ట్‌మెంట్ ఆవరణలో బుధవారం జరిగిన బీజేపీ పెద్దాపురం నియోజకవర్గ స్థాయి సమావేశం తీర్మానించింది. బీజేపీ నాయకులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర ముందుగా మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొక్కిరిగడ్డ గంగరాజు, పుప్పాల నాగగోవిందు, పెంకే పుష్పలత, బోలిశెట్టి రామ్‌కుమార్, పెంకే అరుణ్‌కుమార్, దిమ్మల విజయలక్ష్మి, ఒడిమాని శివ, చుక్కా వెంకటరమణ, పోటోలు వీరగణేష్, పాలిక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ఏర్పాట్లు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం కాకినాడ సాంబమూర్తినగర్‌లో అంధ, బధిర విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి నాయకులు జట్ల శేషుకుమార్, కుక్కల పోతురాజు, తనింకి పార్థసారధి ఆధ్వర్యం వహించారు. తొలుత కేక్ కట్ చేసి ప్రభుత్వ అంధుల పాఠశాల, బధిరుల పాఠశాల విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆకుల వెంకటరమణ, కోలా ప్రసాదవర్మ, పులగల రాజు, తాళ్లూరి రాజు, మల్లిపూడి శివాజీ, గొర్ల కుమార్, వల్లూరి రామ్మోహన్, రొంగల వెంకటేశ్వరరావు, నరుకుల రంగారావు, కంభం రాజబాబు, వనుం నూకరాజు పాల్గొన్నారు.

హరినామ స్మరణకు అవకాశం కల్పించాల్సిందే

భజన సంఘాల సమ్మేళనం



పిఠాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంతో పాటు ప్రముఖ ఆలయాల్లో నిత్యం అఖండ హరినామస్మరణకు అవకాశం కల్పించాల్సిందేనని పలువురు పీఠాధిపతులు అభిప్రాయపడ్డారు. దీని ద్వారా హిందూ ధర్మప్రచారం జరగడంతో పాటు ఆలయ పరిసరాల్లో భక్తి భావం మరింతగా పెరుగుతుందని వారు తెలిపారు. పిఠాపురం బైపాస్ రోడ్డులోని గోపాల్ బాబా ఆశ్రమంలో బుధవారం భజన సంఘాల సమ్మేళనం జరిగింది. ఇందులో తిరుమల తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, లలిత పీఠాధిపతి నిర్వయానంద స్వామీజీ, అన్నమయ్య కళాక్షేత్రం కాకినాడ జిల్లా సమన్వయకర్త సానా నూకరాజునాయుడు తదితరులు పాల్గొని మాట్లాడారు. డిమాండ్లపై దేవదాయశాఖ అధికారులు స్పందించకపోతే నిరాహార దీక్షలను భక్తిమార్గంలో చేపట్టడం మినహా గత్యంతరం లేదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పిఠాపురం కన్వీనర్ యడ్ల ప్రభాకరరావు, వన్నెపూడి సర్పంచ్ కందా నాగబాబు, పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణ, కడారి శ్రీనివాసరావు, భజన బృందాల గురువులు పాల్గొన్నారు.

సేవారత్న పురస్కార గ్రహీత సందీప్‌కు సత్కారం

ఏలేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విశిష్ట సేవారత్న పురస్కారం అందుకున్న స్పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్ సాయి సందీప్‌ను కౌన్సిలర్ బదిరెడ్డి గోవింద్ బుధవారం తన నివాసంలో సన్మానించారు. శిడగం వెంకటేశ్వరరావు, గొల్లపల్లి సురేష్, పైల విజయ్‌కుమార్, గొల్లపల్లి కాశీ, బదిరెడ్డి వెంకన్నబాబు, జేడీ ధనబాబు, దేగల చంద్రమౌళి, దత్తి రాజా, లోగీసు శేఖర్, రవిసాయి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



సమావేశంలో పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

'పేరాబత్తులను ఎమ్మెల్సీగా గెలిపించాలి'

రంపచోడవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని అల్లూరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శిరీషదేవి అధ్యక్షతన జరిగిన బుధవారం రంపచోడవరంలో జరిగిన కూటమి పార్టీల ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మన్యంలోని 4,660 ఓట్లు కూటమి అభ్యర్థికే వచ్చేలా ఇక్కడి నేతలు, నాయకులు సమష్టి కృషి చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, వంతల రాజేశ్వరి, ఎన్నికల పరిశీలకుడు దాడి రత్నాకర్, నియోజకవర్గ పరిశీలకుడు సీహెచ్ శ్రీనివాసరావు, జీసీసీ డైరెక్టర్ గొర్లె సునీత, తెలుగు యువత నాయకుడు మఠం విజయభాస్కర్, బీజేపీ నాయకులు బుల్లికొండలు దొర, భారతి, జనసేన నాయకుడు కుర్ల రాజశేఖరరెడ్డి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం

గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం తొలిసారిగా రంప మన్యానికి వచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆమె పర్యటన ఆద్యంతం ప్రొటోకాల్‌కు దూరంగా నిరాడంబరంగా సాగింది. సీతపల్లి బాపనమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే శిరీషదేవి ఆధ్వర్యంలో కూటమి పార్టీల నాయకులు స్వాగతం పలికారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

ఎటపాక (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో సీపీ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కణితి మధు కోరారు. బుధవారం ఆయన రంపచోడవరంలో మంత్రిని కలిసి పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు.

'కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి'

వీఆర్ పురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసి కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ రేఖపల్లి జంక్షన్ నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. వారికి ఆదివాసీ నాయకులు, సీఐటీయూ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు సరస్వతికి అందజేశారు. సీఐటీయూ జిల్లా సభ్యురాలు సున్నం రంగమ్మ, మండల కార్యదర్శి ఈశ్వరి, కనకమహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వీఆర్ పురంలో తహసీల్దారు సరస్వతికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ కార్యదర్శి కంభం శాంతిరాజు ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం నుంచి బస్టాండు సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మిక సంఘాల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు వేణుగోపాల్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొన్నారు.

చింతూరు (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ నేతృత్వంలో వివిధ రంగాల కార్మికులు తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా చేశారు. కార్మిక నాయకులు చింత రాంబాబు, నూకరత్నం, వెంకటరమణ, కనకదుర్గ, వసంత తదితరులు పాల్గొన్నారు. తహసీల్దారు చిరంజీవికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ అధ్యక్షురాలు నిర్మల డిమాండ్ చేశారు. కార్మికులు ప్రదర్శనగా తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు సూర్యారావుకు సమర్పించారు. అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, 108 సిబ్బంది, ఎండీఎం కార్మికులు, వీవోఏలు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.రామరాజు, మండల నాయకులు కె.వెంకటలక్ష్మి, టి.శ్రీను, సీహెచ్ వెంకటలక్ష్మి, ఎ.అమ్మిరాజు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. నాయకులు ఎస్.వీరబాబు, కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి: ఐటీడీఏ పీవో

రంపచోడవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెలలో జరిగే పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో గిరిజన సంక్షేమ అధికారులు, విద్యాధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేయాలని, ఆయా సబ్జెక్టులను నిపుణులతో చెప్పించాలని సూచించారు. ఏఏ సబ్జెక్టుల్లో విద్యార్థులు బలహీనంగా ఉన్నారో గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

సీఆర్పీ సతీష్‌కు సన్మానం

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్నగూడెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సీఆర్పీ చవలం సతీష్ గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ నుంచి బెస్ట్ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌గా ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం బొర్నగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రమేష్ బాబు ఆధ్వర్యంలో సతీష్‌ను సత్కరించారు. సిబ్బంది బొడరాపు కృష్ణ, దుంప వరప్రసాద్,



శివప్రసాద్, పాండురంగస్వామి, గంగన్నదొర, సతీష్, విజయబాబు, విశ్వనాథరెడ్డి, పాపారావు, బాలరాజులు, ఎల్.రాంబాబు, ఎం.రాంబాబు, రికార్డు అసిస్టెంట్ గొర్లె రాఘవ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

పాడేరు-భద్రాచలం ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

కూనవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి తెలంగాణలోని భద్రాచలానికి ఆర్టీసీ బస్సు సర్వీసును గురువారం నుంచి పునరుద్ధరించారు. పాడేరులో ఉదయం 7.30 గంటలకు బయల్దేరి చింతూరు, కూనవరం మీదుగా సాయంత్రం 5 గంటలకు భద్రాచలం చేరుకుంటుంది. అక్కడ రాత్రి 8.30 గంటలకు బయల్దేరి ఉదయం 6 గంటలకు పాడేరు చేరుకుంటుంది. పాడేరు నుంచి సాయంత్రం వేళల్లో ఈ బస్సు ఉంటే ప్రభుత్వ కార్యాలయాల్లోను, ఇతర పనులు ముగించుకుని విలీన మండలాలకు చేరుకునే అవకాశం ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికల ఫిర్యాదులకు
కంట్రోల్ రూమ్

రంపచోడవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉందని సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదుల నివృత్తికి సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 08864-243561కు సంప్రదించాలని సూచించారు.

'అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పాలి'

చింతూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పాలని ఏపీ ఆదివాసీ జేఏసీ చింతూరు డివిజన్ ఛైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం చింతూరులో ఆదివాసీ జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ చేపడతామన్నారు. సంఘ నాయకులు మోసం మహేష్, కాకా సీతారామయ్య, బీరబోయిన లక్ష్మణ్, కాకా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'ఏలేరు జలాలు సరఫరా చేసి పంటలను కాపాడండి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో దాళ్వా పంట పొలాలకు ఏలేరు ఎడవ కాలువ జలాలు సరఫరా చేసి పంటలను కాపాడాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా కోరారు. బుధవారం ఆమె నిడదవోలులో మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం దాళ్వా పంటకు నీరు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ పారిశ్రామిక అవసరాలకు తరలించే ఏలేరు కాలువ నీటిని నియోజకవర్గ రైతులు వినియోగించుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రాజెక్టుల అభివృద్ధికి, సాగునీటి ఇబ్బందుల పరిష్కారానికి తన వంతు సహకరిస్తానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దాళ్వా పంటకు సాగునీరు అందించాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు. టీడీపీ నాయకుడు పర్వత సురేష్, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, అమరాది వెంకట్రావు, ఇళ్ల అప్పారావు, మంతెన శ్రీను, రామిశెట్టి దివానం తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నిమ్మల రామానాయుడితో ఎమ్మెల్యే సత్యప్రభ



బెనబాబుకు గౌరవ డాక్టరేట్

అన్నవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్నవరంలో మూడు దశాబ్దాలుగా పేదలకు వైద్య సేవలందించడంతో పాటు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆర్ఎంపీ వైద్యుడు పదిలం బెనబాబు సహారా చారిటబుల్ ట్రస్టు నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఆయనకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పూర్వ డీఎంహెచ్‌వో ఎస్ఎస్‌సీ చక్రధరరావు డాక్టరేట్ అందజేశారు.



'భాష్యం'లో గ్రాడ్యుయేషన్ డే

జగ్గంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ నగర్‌లోని భాష్యం స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ, ఐదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులకు భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, జోనల్ ఇన్‌చార్జి గోవిందరాజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పురుగు నివారణకు చర్యలు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మినుము పంట పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధి కారిణి బి.జ్యోతి కోరారు. బుధవారం ఎర్ర వరం గ్రామంలో ఆమె నేతృత్వంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భం గా జ్యోతి మాట్లాడుతూ మినుము పంటలో ఆకు, పూత, పిందె దశల్లో విపరీతంగా లద్దె పురుగు పంటకు హాని కలిగిస్తుందన్నారు.

1,280 పాఠశాలల్లో సోషల్ ఆడిట్

కోటనందూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని 1,280 పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని సమగ్ర శిక్షా సీఎంవో చామంతి నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన కోటనందూరు విద్యా శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం ఫిజియోథెరపీ సెంటరును పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఎంపిక చేసిన 35 పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. కస్టర్ల వారీగా సీఎంఆర్‌టీలకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా మిగిలిన అన్ని పాఠశాలల్లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లకు హెచ్ఎంలతో చర్చించి కొలతలు తీసుకుంటున్నామన్నారు. ఎంఈవోలు శ్రీనివాస్, శేఖర్, సీఆర్పీ యర్ర శేఖర్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కోటనందూరులో ఫిజియోథెరపీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఎంవో నాగేశ్వరరావు

రావులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మహా అన్న సమారాధన

జగ్గంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట గ్రామ దేవత రావులమ్మ అమ్మవారి జాతర, సంబరాలు ముగిసాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌లతో పాటు సుమారు 6వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, పాండ్రంగి రాంబాబు, జీను వెంకట్రావు, జీను రాంబాబు, జీను సోంబాబు, దేవరపల్లి మూర్తి, అడబాల ఆంజేయులు, గెడ్డమూరి బాబ్జీ, పిలా మహేష్, నేదురి గణేష్, రాయి సాయి, కోడూరి రమేష్, కొండ్రోతు శ్రీను, బండారు నాని, ముక్కాపాలు బాబు, నాండ్ల చిరంజీవి, పలివెల యేసు, జీను సత్తిబాబు, పత్రి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరిలోవ వద్ద పోలవరం భూ రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు

'కోర్టు నిబంధనలకు అనుగుణంగానే జంగిల్ క్లియరెన్స్ పనులు'

తుని రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మండలంలో 18 కిలోమీటర్ల మేర జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. కుమ్మరిలోవ గ్రామంలో పలువురు రైతులు వాటిని అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో తహసీల్దారు ప్రసాద్, ఇరిగేషన్ డీఈ మురళి, ఆర్ఐ తాతారెడ్డి అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. కోర్టు నిబంధనలకు అనునుణంగా చట్టబద్ధంగా ఇబ్బందులు లేని ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపడుతున్నామని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దారు పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రమాదానికి గురైన వారిని ఆసుపత్రిలో చేర్పించాలి: ఎంవీఐ

శంఖవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన వారిని మానవతా దృక్పథంతో ఆసుపత్రిలో చేర్పించాలని, అలా చేర్పించిన వారికి ఎటువంటి న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తవని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు బి.శ్రీనివాస్ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఆయన అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబుతో కలిసి ఆటో యూనియన్ సభ్యులకు, వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ గుడ్ సమరిటన్ కార్యక్రమంలో భాగంగా ప్రమాదంలో గాయపడిన వారిని ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా ఆసుపత్రిలో జాయిన్ చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.25వేలు నగదుతో పాటు అవార్డు అందిస్తుందని, వచ్చే నెల నుంచి ఈ పథకం అమలవుతుందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఆటోలో ఎక్కించవద్దని, ఇలా జరిగే ప్రమాదాల వల్ల ప్రయాణికులతో పాటు ఆటో యజమాని కుటుంబమూ రోడ్డున పడుతుందన్నారు. ఎస్ఐ శ్రీహరిబాబు రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. రోడ్డు సేఫ్టీ మెంబర్ బోడపాటి కాంతం, ఆటో యూనియన్ అధ్యక్షుడు అదట్రా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఈ విగ్రహానికి ముసుగేదీ!



ఏలేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు వేశారు. అయితే పక్కరోడ్డులో మార్కెట్ వద్ద ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ముసుగు వేయకుండా వదిలేశారు. దీనిని చూసిన పలువురు అధికారులకు ఇది కనిపించలేదా అని వ్యాఖ్యానిస్తున్నారు.

ముద్రగడను కలిసిన మాజీ మంత్రులు

కిర్లంపూడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డిని కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, పేర్ని నాని, అంబటి రాంబాబు బుధవారం కలిశారు. ముద్రగడ నివాసంపై జరిగిన దాడి ఘటన వివరాలను ఆయనతో పాటు కుమారుడు గిరిబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన దురదృష్టకరమన్నారు.





విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.50వేల విరాళం

జగ్గంపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ నగర్‌లోని స్వగృహంలో జ్యోతుల నవీన్‌ను గోకవరం మండలానికి చెందిన జ్యోతుల నెహ్రూ అనుచరుడు, టీడీపీ బీసీ నాయకుడు పైలా శ్రీనివాసరావు బుధవారం కలిశారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు రూ.50వేలు విరాళం అందజేశారు. చిటికల పాండు, పలివెల బాబి, కొండపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి బోనం ఊరేగింపు

వైభవంగా సత్తెమ్మ తల్లి జాతర

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని బుధవారం వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మవారి బోనాన్ని గ్రామంలో ఊరేగించగా వేలాది మంది భక్తులు ప్రదర్శనలో పాల్గొన్నారు. కేరళ డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారిని సాగనంపారు.

'పేరాబత్తుల'కు మద్దతుగా ప్రచారం

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, టీడీపీ నాయకుడు యనమల రాజేష్ ప్రచారం చేశారు. వారి వెంట టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, దంతులూరి శ్రీనివాసరాజు, అప్పన రమేష్, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, లంక సునీల్, బోనం చినబాబు తదితరులు వున్నారు.

